
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నల్లగొండ
3
బుధవారం 18 సెప్టెంబరు 2024

గరిష్ఠం 31.5
కనిష్ఠం 24.6



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	589.90 (311.7462)	67,871	70,629
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644 (4.20)	382.28	629.46
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	174.17 (44.4)	51,030	51,030

చికెన్ ధరలు | లైవ్ : రూ.110 | డ్రెస్ : రూ.160 | స్కిన్‌లెస్ : రూ.190

తెలంగాణ సాయుధ పోరాటంలో నల్లగొండ జిల్లా కీలక పాత్ర పోషించిందని, ఎందరో త్యాగధనులు స్వాతంత్ర్య ఉద్యమాన్ని ప్రభావితం చేశారని రహదారులు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించిన ప్రజాపాలన దినోత్సవంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. నిజాం నిరంకుశ పాలనలో భూస్వామ్య, జాగీర్దార్ల విధానం, వెట్టి చాకిరీ, బలవంతపు పన్నుల వసూళ్లు, రజాకార్ల దాష్టీకంపై ప్రజలు ఎదురొడ్డి పోరాడారన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఘనత అమరులదేనని, వారి త్యాగం వెలకట్టలేనిది అన్నారు. రాష్ట్ర సాధన కోసం జరిగిన మహోద్యమంలో అమరులైన బిడ్డలందరికీ నివాళులర్పిస్తున్నానని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అమర వీరులపై గౌరవం ప్రకటిస్తోందన్నారు.

- నల్లగొండ



పోలీసుల గౌరవ వందనం స్వీకరించి మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

సాయుధ పోరులో నల్లగొండది కీలక పాత్ర

- రాష్ట్ర సాధనలో అమరుల త్యాగం వెలకట్టలేనిది
- ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేశాం
- ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ నిర్మాణం కోసం కృషి చేస్తున్నాం
- త్వరలో ఎన్‌హెచ్-65 విస్తరణ పనులు ప్రారంభిస్తాం
- రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- ఘనంగా తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం

తెలంగాణ మలిదశ ఉద్యమం 2011 నుంచి జేఏసీ నాయకత్వంలో ప్రారంభమైందని మంత్రి కోమటిరెడ్డి అన్నారు. విద్యార్థులు, ఉద్యోగులు ఈ ఉద్యమంలో భాగస్వాములయ్యారన్నారు. ఈ ఉద్యమంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన శ్రీకాంతాచారితో పాటు ఎందరో యువకులు ప్రాణాలు పోగొట్టుకున్నారని అన్నారు. ప్రజలు పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తున్నప్పుడు సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి కేబినెట్‌లో తనకు మంత్రి పదవి ఎందుకని భావించి పదవికి రాజీనామా చేశానని గుర్తు చేశారు. ప్రజాక్షేత్రంలోకి దిగి 11 రోజులు అమరణ దీక్ష చేపట్టానన్నారు. తెలంగాణ ఉద్యోగులు, కార్మికులు 42 రోజుల పాటు సకలజనుల సమ్మె చేశారన్నారు. మిలియన్ మార్చ్ పేరుతో హైదరాబాద్‌లో లక్షలాది మంది ఉద్యమకారులు కదం తొక్కారని, వంటావార్పు, సాగర హారం, నిరసనలు, ధర్నాలతో తెలంగాణ అట్టుడికిందన్నా రు. తెలంగాణ బిడ్డల త్యాగాలను, పోరాటాలను చూసి సోనియా గాంధీ చలించి రాష్ట్ర ఏర్పాటుకు మార్గం సుగమం చేస్తూ శ్రీకృష్ణ కమిటీని ఏర్పాటు చేశారన్నారు. 2013 అక్టోబరు 3న కేంద్ర మంత్రి మండలి ఆమోదం తెలపడంతో 2014 జూన్ 2న తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటైందన్నారు.



- తెలంగాణలో ఏర్పడిన ప్రజా ప్రభుత్వం ఎన్నికలు ఇచ్చిన హామీల మేరకు ఒక్కోటిగా అమలు చేస్తోందన్నారు. ప్రభుత్వ, ప్రభుత్వరంగ సంస్థల్లో కొత్త ఉద్యోగాల కల్పన కోసం జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించామన్నారు. మహాలక్ష్మి పథకం కింద ఉచితంగా ఆర్టీసీ బస్సు ప్రయాణం కల్పించామని, ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5లక్షల నుంచి రూ.10లక్షలు పెంచామన్నారు. నిరుపేదలకు రూ.500లకే గ్యాస్ సిలిండర్‌ను సరఫరా చేస్తున్నామని, ఇందిరమ్మ ఇళ్ల పథకం కూడా ప్రారంభించామన్నారు. నిరుపేదలకు గృహజ్యోతి పథకం కింద నెలకు 200యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నామన్నారు. చరిత్రలో కనీవిని ఎరుగని రీతిలో ఏకకాలంలో రూ.2లక్షల వరకు రుణమాఫీ చేశామని, ఒక్క నల్లగొండ జిల్లాలోనే 1.73లక్షల కుటుంబాలకు రూ.1,433కోట్లు మాఫీ చేశామన్నారు.
- మహిళలకే పూర్తి అధికారం ఇస్తూ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటు చేశామని నియోజకవర్గానికి ఒకటి చొప్పున అంతర్జాతీయ ప్రమాణాలతో సమీకృత గరుకుల పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్ కల్పించామన్నారు. నల్లగొండ ప్రజల కష్టసుఖాలు తనకు తెలుసని, వారికి అందుబాటులో ఉండే విధంగా వారానికి ఒకరోజు ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నానన్నారు. ప్రజాదర్బార్ ఇతర జిల్లాలకు ఆదర్శంగా నిలుస్తోందన్నారు.
- ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ నిర్మాణం కోసం తాను చేయని ప్రయత్నం లేదన్నారు. టన్నెల్ బోరింగ్ యంత్రం మరమ్మతులతో పనులు నిలిచిపోగా, తాను అమెరికాకు వెళ్లి రాబిన్స్ టన్నెల్ బోరింగ్ కంపెనీ సీఈవో లాక్ హోమ్‌తో చర్చించి సమస్యను పరిష్కరించానన్నారు. జిల్లాలో రైతుల పొలాల్లో పారతో కాల్వ మలిపితే నీరు పారే రోజులు రావాలని, విద్యుత్ మోటార్లు లేని వ్యవసాయం చూడాలన్నదే తన సంకల్పమన్నారు. ఎస్‌ఎల్‌బీసీ పనులు రానున్న రెండేళ్లలో పూర్తిచేస్తామన్నారు. బ్రాహ్మణ వెల్లెంల ఎత్తిపోతల పథకం త్వరితగతిన పూర్తి చేసి జిల్లాను సస్యశామలం చేస్తామన్నారు.
- రూ.275కోట్లతో ప్రభుత్వ వైద్య కళాశాల, రూ.20కోట్లతో నర్సింగ్ కళాశాలను నిర్మిస్తున్నామని, అదేవిధంగా స్కిల్ డెవలప్‌మెంట్‌ను నిర్మిస్తున్నామన్నారు. రాష్ట్ర దశదిశను మార్చే రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి సర్వం సిద్ధంగా ఉందన్నారు. త్వరలోనే ఎన్‌హెచ్-65 విస్తరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, రూ.541కోట్లతో అందోల్ మైసమ్మ దేవాలయం నుంచి రాష్ట్ర సరిహద్దు వరకు పనుల కోసం టెండర్లు పిలిచామన్నారు. జిల్లాలో 241.90 కి.మీల రోడ్లు, బ్రిడ్జిలు, మూడు భవనాల మరమ్మతులకు రూ.512.81కోట్లు మంజూరు చేశామన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ సి.నారాయణరెడ్డి, ఎస్పీ శరత్‌చంద్రపవార్, ఎమ్మెల్యేలు నేనావత్ బాలునాయక్, వేముల వీరేశం, మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, అదనపు కలెక్టర్లు టి.పూర్ణచంద్ర, జె.శ్రీనివాస్, అదనపు ఎస్పీ రాములునాయక్, డీఆర్వో రాజ్యలక్ష్మి, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, ఆర్డీవో రవి, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, 12వ బెటాలియన్ కమాండెంట్ సత్య శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.





అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

నల్లగొండ, నల్లగొండ క్రైం: ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా పోలీస్ పరేడ్ మైదానంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. బాలభవన్ విద్యార్థులు తొలుత 'జయ జయహే తెలంగాణ', 'అల్లో నేరడల్లో' గౌతమ్ విద్యా సంస్థల విద్యార్థులు 'చూడ చక్కని తల్లి.. చుక్కల్లో జాబిల్లి', అప్పాజీపేట బీసీ గురుకుల విద్యార్థినులు 'అమ్మా వందనం.. తెలంగాణ తల్లి అభివందనం', ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాల విద్యార్థినులు 'ఘల్లున.. ఘల్లు ఘల్లున' పాటలకు నృత్యం చేసి ఆకట్టుకున్నారు. గంజాయి, మత్తు పదార్థాలను తీసుకుని ప్రాణాలు కోల్పోవడంతో పాటు జీవితాలను ఛిద్రం చేసుకుంటున్న విద్యార్థులు, యువతకు సంబంధించి జిల్లా పోలీస్‌శాఖ రూపొందించిన మిషన్ పరివర్తన్ కార్యక్రమాన్ని విద్యార్థినులు వారి ప్రదర్శన ద్వారా కళ్లకు కట్టేలా చేసి చూపారు. వారికి మంత్రితోపాటు ఎమ్మెల్యేలు, కలెక్టర్, ఎస్పీ జ్ఞాపికలు అందజేసి అభినందించారు. అదే విధంగా తొలుత పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో మార్చ్ ఫాస్ట్ నిర్వహించగా, పరేడ్ కమాండర్‌గా నరేష్ వ్యవహరించారు. అదేవిధంగా జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆవిష్కరించారు. నల్లగొండ సబ్ డివిజనల్ కార్యాలయంలో జాతీయ జెండాను డీఎస్పీ కొలను శివరాంరెడ్డి, అన్నెపర్తిలోని 12వ బెటాలియన్‌లో బెటాలియన్ కమాండెంట్ సత్యశ్రీనివాస్, వన్‌టౌన్ పీఎస్‌లో జాతీయ జెండాను సీఐ ఏమిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి ఆవిష్కరించారు. జడ్పీతో పాటు కలెక్టరేట్ కార్యాలయంలో జాతీయ జెండాను కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆవిష్కరించారు.



విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

నెహ్రూ కాలంలోనే తెలంగాణలో ప్రజాపాలనకు బీజం

భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి

మిర్యాలగూడ, సెప్టెంబరు 17: మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ కాలంలోనే తెలంగాణలో ప్రజాపాలనకు బీజం పడిందని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బీఎల్ఆర్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రజ్వీ నియంతృత్వ రాచరికానికి వ్యతిరేకంగా, వెట్టిచాకిరీ విముక్తి కోసం సాగిన తెలంగాణ పోరాటాన్ని గుర్తించి ప్రధాని నెహ్రూ, పటేల్ ఆధ్వర్యంలో సైనిక చర్య జరిపి నైజాం రాజుపై ఒత్తిడి పెంచి ప్రజాపాలన నెలకొల్పారని అన్నారు. అప్పటికింకా పుట్టని బీజేపీ, స్వాతంత్ర్య ఉద్యమం పట్టని ఆర్ఎస్ఎస్ సెప్టెంబరు 17ను విమోచన దినంగా చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో బీఆర్ఎస్ దొరల గడీలను కూల్చి ప్రగతిభవన్ ముళ్ల కంచెలను తొలగించి ప్రజాపాలన తీసుకొచ్చారన్నారు. ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, మిర్యాలగూడ పట్టణం వేగంగా విస్తరిస్తోందన్నారు. నార్కెట్‌పల్లి-అద్దంకి రహదారిపై రామచంద్రాపురం వై-జంక్షన్, నందిపాడు, చింతపల్లి, ఈదులగూడెం జంక్షన్ల వద్ద ఫ్లైఓవర్‌లు నిర్మించేందుకు ప్రభుత్వం అనుమతి మంజూరు చేసిందన్నారు. ఈ నెల 18న వాటికి మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి భూమిపూజ నిర్వహించడంతో పాటు వర్షాలకు నష్టపోయిన మహబూబాబాద్ బాధితుల సహాయార్థం రైస్‌మిల్లర్స్ ఆధ్వర్యంలో సేకరించిన 30 టన్నుల బియ్యాన్ని మంత్రులు పంపిణీ చేస్తారని తెలిపారు.

సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులే

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి



అమరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న జూలకంటి రంగారెడ్డి

వేములపల్లి, సెప్టెంబరు 17: తెలంగాణ సాయుధ పోరాటానికి నిజమైన వారసులు కమ్యూనిస్టులే అని, నాటి చరిత్రను బీజేపీ, కాంగ్రెస్ వక్రీకరిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మండలంలోని శెట్టిపాలెం, మొల్కపట్నం, రావులపెంట గ్రామాల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం రావులపెంట గ్రామంలో అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంతకుముందు సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతిపై మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ విముక్తి కోసం కమ్యూనిస్టులు రజాకారులకు ఎదురొడ్డి వీరోచితంగా పోరాడారని గుర్తు చేశారు. కానీ, ఈ పోరాటాన్ని బీజేపీ హిందువులు, ముస్లింల పోరాటంగా చిత్రీకరించి ప్రజలను మోసం చేస్తోందన్నారు. నాడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం నిజాం నవాబు పాలనలో కీలకంగా ఉన్న నాయకులకు పదవులు ఇచ్చి కమ్యూనిస్టు ఉద్యమాన్ని అణచివేసేందుకు కుట్రలు చేసిందన్నారు. నాటి సాయుధ పోరాటంలో నాలుగువేల మంది కమ్యూనిస్టు కార్యకర్తలు, పేదలు ప్రాణాలు కోల్పోయారన్నారు. అనంతరం సాయుధ పోరాట అమరులను స్మరిస్తూ పుట్టల ఎల్లయ్య భార్య లక్ష్మమ్మ, చింతకుంట్ల రాములు, గాదె పద్మమ్మ, బంగారయ్యను సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు డబ్బికార్ మల్లేష్, వీరేపల్లి వెంకటేశ్వర్లు, నూకల జగదీశ్చంద్ర, రవినాయక్, మల్లు గౌతంరెడ్డి, వరలక్ష్మి, ఎస్‌కె.అయూబ్, రెమడాల పరుశురాములు, గాదె పద్మమ్మ, శీలం చిన్నసైదులు, రాములు, కందుల నాగిరెడ్డి, రెమడాల భిక్షం, నామ సోమయ్య, ప్రణీత్‌రెడ్డి పాల్గొన్నారు.

వంట నూనెల ధరల మంట

- దిగుమతి సుంకం పెంపుతో ధరలకు రెక్కలు
- ఒక్కో ప్యాకెట్‌పై రూ.15 నుంచి రూ.20 పెంపు
- పండుగల వేళ ప్రజలపై పెనుభారం

పండుగల వేళ సామాన్యుడి నెత్తిన మరో పిడుగు పడినట్లయింది. వంట నూనెల ధరలు కాకపుట్టిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకాన్ని పెంచడంతో మార్కెట్లో నూనెల ధరలకు రెక్కలొచ్చాయి. ఒక్కో నూన ప్యాకెట్‌పై రూ.15 నుంచి రూ.20 వరకు పెంచి విక్రయిస్తున్నారు. కాగా, రోజు రోజుకూ నూనెల దందా జోరుగా సాగుతుండటంతో ప్రజల ఆరోగ్యం గాలిలో దీపంలా మారుతోంది.

- భూదాన్‌పోచంపల్లి



కేంద్ర ప్రభుత్వం వంట నూనెలపై దిగుమతి సుంకాన్ని (ఇంపోర్ట్ డ్యూటీ) పెంచుతున్నట్లు ప్రకటించడంతో మార్కెట్లో ఒక్కసారిగా ధరలు పెరిగాయి. అన్ని రకాల నూనెల ధరలు లీటర్‌పై ఒక్కసారిగా రూ.15నుంచి రూ.20వరకు పెరిగాయి. పామాయిల్ రూ.100 నుంచి రూ.115, సన్‌ఫ్లవర్ ఆయిల్ రూ.115నుంచి రూ.130-140,వేరుశనగ నూనె రూ.155నుంచి రూ.165కు చేరింది. రూ.170 ఉన్న మంచి పల్లీ నూనె రూ.220 వరకు పెరిగింది. పూజలకు ఉపయోగించే నూనెలనూ రూ.110 నుంచి రూ.120కి పెంచి వ్యాపారులు విక్రయిస్తున్నారు. పండుగలు మొదలైన తరుణంలో నూనె ధరలు పెంచడంపై వినియోగదారులు భగ్గుమంటున్నారు.

జోరుగా కల్తీ నూనెల దందా

మార్కెట్లో కల్తీ నూనెల దందా జోరుగా సాగుతోంది. వేరుశనగ గింజలు కొని గానుగాడిస్తే లీటర్ పల్లీనూనె ధర రూ.300పై చిలుకు పడుతోంది. కానీ, మార్కెట్లో వేరుశనగ నూనె పేరుతో రూ.210కే విక్రయిస్తున్నారు. అంటే దానిలో కల్తీ ఉన్నట్లేనని వినియోగదారులు పేర్కొంటున్నారు. పొద్దు తిరుగుడు నూనె విషయంలోనూ ఇదే పరిస్థితి ఉంది. ఇక రూ.100కు లీటర్ చొప్పున విక్రయిస్తున్న నూనెలు దేని నుంచి తయారవుతున్నాయో తెలియదని వినియోగదారులు వాపోతున్నారు. ఇష్టమొచ్చిన కల్తీ నూనెలు వాడకం వల్ల పలు అనారోగ్య సమస్యలు ఏర్పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నూనె గింజల సాగు నానాటికీ తగ్గిపోతోంది. వాటికి మద్దతు ప్రకటించి మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేసి పౌరసరఫరాలశాఖ, రేషన్ దుకాణాల ద్వారా వంట నూనెలు సరసమైన ధరలకు పంపిణీ చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఏం కొనేట్టు లేదు



వంట నూనె ధరలు అకస్మాత్తుగా పెంచేశారు. పండుగ పూట పిండి వంటలు చేసుకునే వేళ ఇలా ధరలు పెంచడం తగదు. ఒకేసారి లీటర్ నూనెకు రూ.20 పెంచడం దారుణం. కేంద్ర ప్రభుత్వం నూనెలపై పెంచిన ధరలు వెంటనే తగ్గించాలి.

- యాదమ్మ, గృహిణి, భూదాన్‌పోచంపల్లి

ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే మెరుగైన వైద్య సేవలు

జిల్లాలో డెంగీ కేసులు లేవు
డీఎంహెచ్‌వో పుట్లల శ్రీనివాస్



నిడమనూరులో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో శ్రీనివాస్

నిడమనూరు, సెప్టెంబరు 17: జిల్లాలో ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రులు, ఆరోగ్య కేంద్రాల్లోనే పేదలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని డీఎంహెచ్‌వో పుట్లల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీని ఆయన తనిఖీ చేశారు. మండలంలో నిర్వహిస్తున్న ఫీవర్ సర్వే, ఆరోగ్య సేవల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. నూతనంగా నిర్మిస్తున్న ఆరోగ్య కేంద్రం భవనాన్ని పరిశీలించి, నిర్మాణ పనులు వేగవంతం చేసి సకాలంలో భవనాన్ని అప్పగించేందుకు చర్యలు తీసుకోవాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. వైద్య సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించి విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో డెంగీ, చికున్‌గున్యా జ్వరాలు లేవని, సాధారణ జ్వరాలు మాత్రమే ఉన్నాయన్నారు. వర్షాకాలంలో సాధారణ జ్వరాలు సహజమేనని, వీటితో ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అన్ని గ్రామాల్లో వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి ఫీవర్ సర్వే నిర్వహిస్తున్నారన్నారు. విష జ్వరాల పేరుతో పేదలు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి అనవసరంగా డబ్బులు ఖర్చు చేయవద్దన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దూరంగా ఉంటాయన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ల్యాబ్‌లు, ఆస్పత్రులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తప్పుడు పత్రాలతో వైద్యులుగా చెలామణి అవుతున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, దేవరకొండ ప్రాంతంలో మూడు ఆస్పత్రులను సీజ్ చేసినట్టు తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యం చేస్తే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది, మందుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ గీతావాణి, డీటీసీవో కల్యాణ చక్రవర్తి, మండల వైద్యాధికారి రఫీ, శంకర్‌నాయక్, గంటా సోమయ్య, సీహెచ్‌వోలు రమేష్, మోతీలాల్, పీహెచ్ఎన్ రజిని, పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రతిపాదనలు పంపాలి

నల్లగొండ, సెప్టెంబరు 17: వానాకాలం ధాన్యం కొనుగోలుకు అవసరమైన కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి ప్రతిపాదనలు సమర్పించాలని అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ అన్నారు. మంగళవారం అధికారులు, రైస్ మిల్లర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 400 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అందుకు సంబంధించి రెండు, మూడు రోజుల్లో ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు, తూకం యంత్రాలు, ప్యాడీక్లీనర్లు సిద్ధంగా ఉంచాలన్నారు. కస్టమ్ మిల్లింగ్ త్వరితగతిన అప్పగించాలన్నారు. సమావేశంలో డీఎస్‌వో వెంకటేశ్వర్లు, పౌరసరఫరాల డీఎం హరీష్, వ్యవసాయాధికారి శ్రవణ్, డీఆర్‌డీవో శేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దుర్మార్గపు రాజకీయాలు చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్



దేవరకొండలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్

దేవరకొండ, సెప్టెంబరు 17: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దుర్మార్గపు రాజకీయాలు చేస్తున్నారని, ప్రజలు తగిన గుణపాఠం చెప్పే రోజులు దగ్గరలో ఉన్నాయని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. మంగళవారం దేవరకొండలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించి తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేసి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం పేరుచెబితే తుపాకులతో కాల్చుతామన్నవారే అసెంబ్లీ వద్ద రాజీవ్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని గెలిపించడం ప్రజలు చేసుకున్న దురదృష్టకరమన్నారు. 14ఏళ్ల పోరాడి సాధించుకున్న తెలంగాణను కేసీఆర్ ముఖ్యమంత్రిగా అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారన్నా రు. తెలంగాణ తల్లి విగ్రహం కాకుండా రాజీవ్‌గాంధీ విగ్రహం పెట్టడం తెలంగాణ సమాజాన్ని అవమానించడమే అన్నారు. కార్యక్రమంలో టీవీఎన్.రెడ్డి, చింతపల్లి సుభాష్, బాలయ్య, రవీందర్‌రెడ్డి, వేములరాజు, కృష్ణ, ఆరేకంటి రాములు, తదితరులు పాల్గొన్నారు.


అధికారంలోకి రాగానే తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రతిష్టిస్తాం

నల్లగొండ: తమ పార్టీ తిరిగి అధికారంలోకి వచ్చిన వెంటనే సచివాలయం ఎదురుగా తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తుందని బీఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బోనగిరి దేవేందర్, మాలే శరణ్యారెడ్డి, మారగోని గణేష్, కొండూరు సత్యనారాయణ, జమాల్‌ఖాద్రీ, అయితగోని యాదయ్య, రావుల శ్రీనివాస్‌రెడ్డి, రమేష్, జ్యోతి, నాగేశ్వర్‌రావు, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.









అగ్ని ప్రమాదంలో రూ.3లక్షల ఆస్తి నష్టం

తిరుమలగిరి(సాగర్), సెప్టెంబర్ 17: విద్యుదాఘాతంతో జరిగిన అగ్ని ప్రమాదంలో రూ.3 లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండల కేంద్రంలో మంగళవారం ఈ ఘటన జరిగింది. స్థానికులు, బాధితుల వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఇరిగి మరియమ్మ తన భర్త కాశయ్య చనిపోవడంతో పదేళ్లుగా మూడు గేదెలను పెంచుకుంటూ జీవనం సాగిస్తుంది. ఈ క్రమంలో తనకున్న గేదెలను మేపడానికి సమీపంలోని పొలాల వద్దకు వెళ్లింది. ఈ క్రమంలో సాయంత్రం సుమారు 5గంటల సమయంలో షార్ట్ సర్క్యూట్ కావడంతో ఇంట్లోని సామగ్రి అంతా దగ్ధమైంది. అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో వారు వచ్చి మంటలను ఆర్పి వేశారు. ఆర్ఐ లక్ష్మీకాంత్, పంచాయతీ కార్యదర్శి బుర్రి శ్రీనివాస్‌లు పంచనామా నిర్వహించారు. సుమారు రూ.3లక్షల మేర ఆస్తినష్టం జరిగిందని, తమ కుటుంబాన్ని ఆదుకోవాలని బాధితురాలు వేడుకుంది.



క్షేత్రపాలకుడికి నాగవల్లీ దళార్చనలు

● యాదగిరీశుడి సన్నిధిలో శాస్త్రోక్తంగా నిత్యపూజలు



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, సెప్టెంబరు 17: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి సన్నిధిలో కొలువుదీరిన క్షేత్రపాలకుడు అంజనేయస్వామికి మంగళవారం నాగవల్లీ దళార్చనలు, స్వామికి నిత్యపూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. కొండపైన విష్ణుపుష్కరిణి వద్ద ఆంజనేయస్వామికి వేదమంత్రాలతో పంచామృతాభిషేకం జరిపిన అర్చకులు సింధూరం, వివిధ రకాల పుష్పాలతో అలంకరించి ఆంజనేయుడికి సహస్రనామ పఠనాలతో నాగవల్లీ దళార్చనలు చేశారు. ప్రధానాలయంలోని స్వయంభువులను సుప్రభాత సేవతో మేల్కొలిపి నిజాభిషేకం, నిత్యార్చనలు ముఖమండపంలో సుదర్శన నారసింహ హోమం, నిత్య తిరుకల్యాణ పర్వాలను పాంచరాత్రాగమశాస్త్రరీతిలో నిర్వహించారు. పాతగుట్ట ఆలయం, విష్ణుపుష్కరిణి, శివాలయంలోని ఆంజనేయస్వామిని ఆరాధిస్తూ అర్చకులు ప్రత్యేక పూజలు చేయగా శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామికి ముఖ మండపంలోని స్ఫటికమూర్తులకు నిత్యపూజలు, నిత్య రుద్రహవనం శైవగామ పద్ధతిలో కొనసాగాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.23,25,994 ఆదాయం రాగా లీజుల ద్వారా రూ.2,78,947 సమకూరినట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు. కాగా, కొండపైన జాతీయ జెండా ఆవిష్కరణ డీఈవో దోర్బల భాస్కర్‌శర్మతో కలిసి ఆలయ ఈవో ఏపూరి భాస్కర్‌రావు చేశారు. అంతకు ముందు పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం ప్రత్యేకపూజలు చేశారు.

నల్లగొండ - భువనగిరి మధ్య సెమీ డీలక్స్ బస్సులు

నల్లగొండ, సెప్టెంబరు 17: ప్రయాణికుల సౌకర్యార్థం నల్లగొండ-భువనగిరి మధ్య సెమీ డీలక్స్ బస్సులను ప్రారంభించినట్లు రీజనల్ మేనేజర్ ఎం.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. నల్లగొండ నుంచి చిట్యాల, వలిగొండ మీదుగా భువనగిరికి ఈ సెమీ డీలక్స్ బస్సులు నడుస్తాయన్నారు. నల్లగొండ నుంచి భువనగిరి వరకు ఎక్స్‌ప్రెస్ చార్జి రూ.100, సెమీ డీలక్స్ బస్సుల్లో రూ.110 చార్జీలు ఉంటాయన్నారు. సెమీ డీలక్స్ బస్సుల్లో మహాలక్ష్మి పథకం వర్తించదని తెలిపారు.













జీ.ఎడవల్లి కొత్త చెరువుకు గండ్లు

● చెరువు నీరు వృథా... గండ్లు పూడ్చాలంటున్నరైతులు


చెరువుకు గండి పడిన ప్రాంతం

కనగల్, సెప్టెంబరు 17: నల్లగొండ జిల్లా కనగల్ మండంలోని జీఎడవల్లి గ్రామ కొత్తచెరువు అలుగుకు పలుచోట్ల గండ్లుపడ్డాయి. దీంతో చెరువులోని నీరంతా దిగువకు వృథాగా పోతోంది. చెరువుకు గతేడాది ఇదే చోట గండ్లుపడగా రైతులు తాత్కాలికంగా మరమ్మతులు చేసి గండ్లను పూడ్చి వేశారు. అయితే అలుగు కట్ట బలహీనంగా ఉండటంతో అక్కడే మళ్లీ గండ్లు ఏర్పడ్డాయని రైతులు వాపోయారు. ఇరిగేషన్ అధికారులు స్పందించి గండ్లను తక్షణమే పూడ్చివేసి నీటి వృథాను అడ్డుకోవాలని కోరుతున్నారు. చెరువు విస్తీర్ణం సుమారు 400 ఎకరాలుండగా, అదేస్థాయిలో ఆయకట్టు విస్తీర్ణం ఉందని రైతులు వివరించారు.

అంతర్జాతీయ ఫెన్సింగ్ క్రీడలో ప్రతిభ

● అంతర్జాతీయ 24వ స్థానంలో నిలిచిన బంగారిగడ్డవాసి


షేక్ ఫౌజియా

చండూరు రూరల్, సెప్టెంబరు 17: నల్లగొండ జిల్లా చండూరు మండలం బంగారిగడ్డ గ్రామానికి చెందిన షేక్ ఫౌజియా అంతర్జాతీయ ఫెన్సింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచి అంతర్జాతీయ 24వ స్థానంలో నిలిచింది. ఈ నెల 14, 15 తేదీల్లో న్యూఢిల్లీలోని ఇందిరాగాంధీ స్టేడియంలో జరిగిన పోటీల్లో భారతదేశం తరపున తలపడి 24వ స్థానంలో నిలిచింది. ఫోయిల్ ఉమెన్స్ సాటిలైట్ టోర్నీలో పాల్గొన్న ఫౌజియా ప్రస్తుతం వరంగల్‌లో సివిల్ కానిస్టేబుల్‌గా శిక్షణ పొందుతున్నారు. తనకు ఇంతటి సహాయ సహకారాలు అందించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

యర్రవరం పీఏసీఎస్ కార్యదర్శి సస్పెండ్

కోదాడ రూరల్, సెప్టెంబర్ 17: సూర్యాపేట జిల్లా కోదాడ మండలం యర్రవరం సింగిల్ విండో సహకార పరపతి సంఘం కార్యదర్శి హుస్సేన్, కంప్యూటర్ ఆపరేటర్ పాముల వెంకటేశ్వర్లును సస్పెండ్ చేస్తూ మంగళవారం సంఘం తీర్మానించింది. ఇందుకు సంబంధించిన తీర్మాణ కాపీని జిల్లా సహకార అధికారికి పంపినట్లు చైర్మన్ నలజాల శ్రీనివాస్ తెలిపారు. ఆయన అధ్యక్షతన జరిగిన సహకార పరపతి సంఘ సమావేశంలో సభ్యులు మాట్లాడుతూ రుణమాఫీని రైతులకువర్తింపజేయడంలో సంఘ కార్యదర్శి, కంప్యూటర్ ఆపరేటర్లు నిర్లక్ష్యం వహించినందుకు సంఘంలో 66 మంది రైతులకు రూ.30లక్షల రుణమాఫీ వర్తించకుండా పోయిందన్నారు. ఈ విషయంపై రైతులు సంఘం చైర్మన్, జిల్లా సహకార అధికారికి ఫిర్యాదు చేశారన్నారు. రైతుల ఫిర్యాదు మేరకు జిల్లా సహకార అధికారి విచారణకు ఆదేశించారన్నారు. విచారణ జరిపిన అధికారులు సంఘం కార్యదర్శి హుస్సేన్, కంప్యూటర్ ఆపరేటర్ వెంకటేశ్వర్లు రుణమాఫీకోసం రైతుల జాబితాను ప్రభుత్వానికి, జిల్లా బ్యాంక్‌కు పంపడంలో నిర్లక్ష్యం వహించినట్లు గుర్తించారు. ఇందుకు బాధ్యులైన ఇరువురిపై చర్యలు తీసుకోవాలని జిల్లా సహకార అధికారి చైర్మన్‌ను ఆదేశించడంతో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించి కార్యదర్శి హుస్సేన్, కంప్యూటర్ ఆపరేటర్ వెంకటేశ్వర్లును సస్పెండ్‌చేయాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. సమావేశంలో చైర్మన్ నలజాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ సుభాష్‌రెడ్డి, డైరెక్టర్లు గుగులోతు రవి, సైదా, మంగమ్మ, అన్నెం రవీందర్‌రెడ్డి, పల్లపు సుదర్శన్, మండాది శ్రీను పాల్గొన్నారు.

సాగర్‌కు కొనసాగుతున్న వరద

● రెండు గేట్ల ద్వారా నీటి విడుదల ● పూర్తిస్థాయి నీటిమట్టానికి మూసీ జలాశయం ● పులిచింతల నుంచి దిగువకు కొనసాగుతున్న కృష్ణమ్మ పరవళ్లు

నాగార్జునసాగర్, కేతేపల్లి, మేళ్లచెర్వు, సెప్టెంబరు17: నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద రాక కొనసాగుతుండటంతో రెండు క్రస్ట్ గేట్ల నుంచి దిగువకు నీటి విడుదల కొనసాగుతోంది. ఎగువన ఉన్న శ్రీశైలం నుంచి 67,871 క్యూసెక్కుల వరద సాగర్‌కు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 590 అడుగులు(312.0450టీఎంసీలు) కాగా, మంగళవారం సాయంత్రానికి 589.90 అడుగులుగా(311.7462టీఎంసీలు) నమోదైంది. ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ, కుడి, ఎడమకాల్వలకు, 2గేట్ల నుంచి మొత్తం 70,629 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ నెల 11వ తేదీన మొత్తం 11గేట్లు మూసివేయగా, 12వ తేదీన 10గేట్లు ఎత్తి అదే రోజు రాత్రి అన్నీ గేట్లు మూసేశారు. 13వ తేదీన 2గేట్లు ఎత్తగా, 14న మరో 2గేట్లు ఎత్తి మొత్తం 4 నాలుగు గేట్ల నుంచి నీటి విడుదల చేశారు. ఆదివారం నాలుగు గేట్ల నుంచి నీటి విడుదలను కొనసాగించగా, సోమవారం రెండు గేట్లు మూసివేసి రెండు గేట్ల నుంచి నీటిని దిగువకు విడుదల చేశారు. మంగళవారం రెండు గేట్ల నుంచి నీటి విడుదల కొనసాగించారు.


సాగర్ ప్రాజెక్ట్ నుంచి రెండు గేట్ల ద్వారా కొనసాగుతున్న నీటి విడుదల

మూసీకి 382.28క్యూసెక్కుల వరద

నల్లగొండ, సూర్యాపేట జిల్లాల పరిధిలో ఉన్న మూసీ జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 645అడుగులు(4.46టీఎంసీలు) కాగా, మంగళవారం సాయంత్రానికి 644అడుగులుగా(4.20టీఎంసీలు) నమోదైంది. ఎగువనుంచి 382.28క్యూసెక్కుల వరద వస్తుండగా, కాల్వలకు 629.46క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

రెండు గేట్ల ద్వారా పులిచింతల నీరు..

ఉభయ తెలుగు రాష్ట్రాల సరిహద్దులోని పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద ప్రవాహం నిలకడగా కొనసాగుతుండగా.. రెండు గేట్లు నుంచి నీటి విడుదల కొనసాగుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 175 అడుగులు (45.77 టీఎంసీలు) కాగా, మంగళవారం సాయంత్రానికి 174.17 అడుగులుగా(44.4 టీఎంసీలు) నమోదైంది. ఎగువ నుంచి 51,030 క్యూసెక్కుల వరద వస్తుండగా, రెండు గేట్ల నుంచి 35,030 క్యూసెక్కులు, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం నుంచి 16వేల క్యూసెక్కులు మొత్తంగా 51,030 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ నెల 11వ తేదీన మొత్తం 24గేట్లను మూసివేగా, 12న మూడు గేట్లను ఎత్తారు. 13న రెండు గేట్లు మూసి ఒక గేటు నుంచి నీటి విడుదల చేశారు. 14వ తేదీన మరో రెండు గేట్లు ఎత్తి మూడు గేట్ల నుంచి, ఆదివారం ఒక గేటు మూసి రెండు గేట్ల నుంచి విడుదల చేశారు. సోమవారం రెండు గేట్ల నుంచి నీటి విడుదల చేయగా, మంగళవారం దిగువకు నీటి విడుదల కొనసాగుతోంది.

ఎమ్మెల్యే సంజయ్‌గైక్వాడ్‌పై చర్యలు తీసుకోవాలి

● రాహుల్‌గాంధీపై వివాదాస్పద వ్యాఖ్యలు సరికాదు ● భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి


శాలిగౌరారం పోలీస్‌స్టేషన్‌లో సంజయ్ గైక్వాడ్‌పై ఫిర్యాదు చేస్తున్న కిరణ్ కుమార్‌రెడ్డి, వీహెచ్

శాలిగౌరారం, సెప్టెంబరు 17: శివసేన ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్‌పై చర్యలు తీసుకోవాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఈ మేరకు ఆయన నల్లగొండ జిల్లా శాలిగౌరారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీపై మహారాష్ట్ర సీఎం షిండే వర్గానికి చెందిన సంజయ్ గైక్వాడ్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా ఉన్నందున అతనిపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ నాలుక కోసిన వారికి రూ.11లక్షలు బహుమతి ఇస్తానని ప్రకటించడం ఎంత వరకు సమంజసమన్నారు. ఈ ద్వేషపూరిత వ్యాఖ్యలు సమాజంలో దుష్ప్రవర్తనను ప్రోత్సహించే విధంగా ఉన్నాయన్నారు. ఈ వ్యాఖ్యలు రాహుల్ గాంధీని చంపేందుకు కాంట్రాక్ట్(సుపారీ) ఇవ్వడం తప్ప మరొకటి కాదన్నారు. దేశ సమగ్రతకు భంగం కలిగించే ఈ వ్యాఖ్యలపై ఎఫ్ఐఆర్ నమోదుచేసి ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని శాలిగౌరారం సీఐ కొండల్ రెడ్డి, ఎస్ఐ డి.సైదులుకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. రాజ్యసభ మాజీ సభ్యుడు హనుమంతరావు, ఎమ్మెల్యేలు మందుల సామేల్, వేముల వీరేశం కూడా ఫిర్యాదులో సంతకాలు చేశారు.

దాడి ఘటనలో ముగ్గురిపై కేసు

మేళ్లచెర్వు, సెప్టెంబరు 17: సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండల కేంద్రంలో ఒక కుటుంబానికి చెందిన ముగ్గురిపై దాడి కేసు నమోదైంది. ఎస్ఐ పరమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఉప్పతల అయోధ్య, సాతునూరి మాధవరావు, ఒకే వీధిలో ఎదురెదురుగా ఉంటున్నారు. ఈ రెండు కుటుంబాల మధ్య మురుగుకాల్వ విషయంలో గతంలో అనేక గొడవలు జరిగాయి. కాగా మంగళవారం ఉదయం అయోధ్య అతని భార్య వారి ఇంటి ఆవరణలో ఉండగా.. సాతునూరి సురేష్ వారిని ఫొటోలు తీశారని, అదేమిటని అడగగా సాతునూరి సురేష్, సాతునూరి మాధవరావు సాతునూరి లక్ష్మీలు అయోధ్య, అయోధ్య భార్యపై దాడి చేశారని అయోధ్య భార్య రంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యువకుడి అరెస్ట్

దేవరకొండ, సెప్టెంబరు 17: నల్లగొండ జిల్లా దేవరకొండలో వినాయక నిమజ్జన శోభాయాత్రలో ఈ నెల 16న మద్యం మత్తులో బూషరాజు సంతోష్ అనే యువకుడు పులిజాల శంకర్‌పై కత్తితో దాడి చేసిన ఘటనలో సంతోష్‌ను అరెస్ట్ చేసి మంగళవారం కోర్టుకు రిమాండ్ పంపినట్లు దేవరకొండ సీఐ నర్సింహులు తెలిపారు. గణేష్ శోభాయాత్రలో మద్యం మత్తులో ఉన్న సంతోష్ బొడ్రాయిబజార్‌కు చెందిన శంకర్‌తో గొడవపడ్డాడు. మత్తులో నిమ్మకాయలు కోసే కత్తితో సంతోష్ శంకర్‌ను గాయపరచగా, స్వల్పంగా గాయాలుకాగా దేవరకొండ ఆస్పత్రిలో చికిత్స నిర్వహించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు. శంకర్ తల్లి లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు సంతోష్‌ను కోర్టుకు రిమాండ్‌కు పంపినట్లు సీఐ చెప్పారు.

గణేష్ నిమజ్జనోత్సవంలో అపశ్రుతి

● చెరువులో పడి యువకుడి మృతి ● యాదాద్రిభువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలంలో విషాదం


రోదిస్తున్న కుటుంబ సభ్యులు, (ఇన్‌సెట్‌లో) ప్రవీణ్(ఫైల్)

భూదాన్‌పోచంపల్లి, సెప్టెంబరు 17: అప్పటివరకు ఆనందోత్సాహాలతో సాగిన గణేష్ నిమజ్జనోత్సవంలో చిన్న ఏమరపాటు కారణంగా ఓ యువకుడు చెరువులో పడి మృత్యువాతపడ్డాడు. ఎస్ఐ భాస్కర్‌రెడ్డి, కుటుంబసభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. యాదాద్రిభువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం జిబ్లక్‌పల్లి గ్రామం ముష్కోన్‌బాయి కాలనీకి చెందిన పబ్బతి మల్లయ్య కూలి పని చేస్తూ జీవనం సాగిస్తుండగా, కుమారుడు ప్రవీణ్, కుమార్తె ఉన్నారు. కుమార్తెకు వివాహంకాగా, కుమారుడు ప్రవీణ్ (27) బీటెక్ పూర్తిచేసి హైదరాబాద్‌లో ఉంటున్న బావ వద్ద సివిల్ కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నాడు. వినాయక చవితి పండుగ నిమిత్తం ఈ నెల 14వ తేదీన స్వగ్రామం చేరుకుని ఇంటివద్ద ఏర్పాటుచేసిన వినాయక చవితి ఉత్సవాల్లో పాల్గొన్నాడు. మంగళవారం ఉదయం గ్రామంలో నిర్వహించిన గణేష్ నిమజ్జనోత్సవానికి తన స్నేహితులతో కలిసి ఊర చెరువుకు వెళ్లాడు. చెరువులో జారి పడి నీటిలో మునిగిపోయాడు. కొద్దిసేపటికి ప్రవీణ్ లేడనే విషయాన్ని గమనించిన స్నేహితులు చెరువులో గాలించారు. ఉపాధి పనుల్లో భాగంగా చెరువులో ఇటీవల తవ్విన పెద్ద గుంతలో ఇరుక్కోవడంతో 15నిమిషాల అనంతరం ఒడ్డుకు తీసుకువచ్చారు. ప్రాథమిక చికిత్స చేసేందుకు ప్రయత్నిస్తుండగా అప్పటికే మృతి చెందాడని గుర్తించారు. చెరువులో మునిగినా ఈత రాకపోవడంతో గుంతలో ఇరుక్కుపోవడంతో ఊపిరాడక మృతిచెందడంతో స్నేహితులు కన్నీటి పర్యంతమయ్యారు. తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

శిశువు మృతిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు

హుజూర్‌నగర్, సెప్టెంబరు 17: వైద్యుల నిర్లక్ష్యంతోనే తమ శిశువు మృతి చెందిందని సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం గుర్రంపోడు తండాకు చెందిన బాసిపాకుల రేణుక, నాగరాజు ఆరోపించారు. మంగళవారం జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 15 ఆదివారం తన భార్య రేణుక పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో డెలివరి కోసం అడ్మిట్ అయిందని నాగరాజు అన్నారు. కాగా డ్యూటీ డాక్టర్ లేకపోవడం, నర్సుల నిర్లక్ష్యంతో నార్మల్ డెలివరీ అయినప్పటికి తమ శిశువు చనిపోయిందన్నారు. డ్యూటీలో ఉన్న డాక్టర్లు, నర్సులు కాన్పు సమయంలో తన భార్యను అసభ్యంగా దూషించి చేయి చేసుకున్నారని ఆరోపించారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కాగా డెలివరీ సమయంలో పాప నార్మల్‌గానే ఉందని, శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా ఉంటే సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి మూడు రోజుల క్రితమే పంపించామని ఆసుపత్రి ఇన్‌చార్జి తెలిపారు. డ్యూటీ డాక్టర్లు, నర్సుల తప్పు ఏమీ లేదన్నారు. గర్భిణీపై ఎవరు దాడి చేయలేదన్నారు.

భూమిని పట్టా చేయడం లేదని చంపేశాడు

● తండ్రిని హతమార్చిన తనయుడు ● తల్లీకుమారుల పరార్

కేతేపల్లి, సెప్టెంబరు 17: భూమిని తన పేరిట పట్టా చేయడంలేదనే ఆగ్రహంతో తనయుడు తండ్రిని హతమార్చాడు. మంగళవారం రాత్రి నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలోని చెరుకుపల్లి గ్రామంలో ఈ ఘటన జరిగింది. స్థానికుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. చెరుకుపల్లి గ్రామానికి చెందిన పిట్టల సైదులు(45) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తనకున్న మూడు ఎకరాలకు తోడు మూడు ఎకరాల భూమిని కౌలుకు తీసుకున్నాడు. సైదులుకు భార్య ప్రమీల, కుమారుడు నవీన్, కుమార్తె ఉన్నారు. కుమార్తెకు వివాహం చేయగా, కుమారుడు నవీన్ ఇంటి వద్దే ఉంటూ తండ్రికి చేదోడువాదోడుగా ఉంటున్నాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో కొద్దికాలంగా భార్యాభర్తల మధ్య వివాదాలు నెలకొన్నాయి. ఇదే సమయంలో తండ్రి సైదులు పేరిట ఉన్న మూడు ఎకరాల భూమిని తన పేరిట పట్టా చేయించమంటూ కుమారుడు నవీన్ తరచూ గొడవపడుతున్నాడు. ఈ విషయంలో సైదులు భార్య ప్రమీల సైతం కుమారుడు నవీన్‌కు మద్దతుగా ఉంటోంది. ఇదే విషయమై మంగళవారం మరోసారి ఇరువురి మధ్య గొడవ జరగడంతో ఆవేశంలో నవీన్.. తండ్రి సైదులు తలపై రోకలి బండతో మోదాడు. దీంతో సైదులు తలపగిలి రక్తపు మడుగులో పడి మృతిచెందాడు. ఇది గమనించిన తల్లీ కుమారులు ఇంటినుంచి పరారయ్యారు. ఇంట్లో జరిగిన గొడవను గమనించిన స్థానికుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. సైదులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని కేతేపల్లి ఎస్ఐ శివతేజ వివరించారు.

దొంగకు దేహశుద్ధి చేసి...

పులిహోర తినిపించారు

● నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలో ఘటన


ఆకలిగా ఉందని చెప్పడంతో పులిహోర తినిపిస్తున్న యువకుడు

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 17: ఓఆలయంలో చోరీకి యత్నించిన యువకుడిని పట్టుకున్న యువకులు దేహశుద్ధి చేసి స్తంభానికి కట్టేశారు.. అనంతరం ఆకలి వేస్తుందని చెప్పటంతో పులిహోర తినిపించి తండ్రికి అప్పజెప్పారు. సోమవారం రాత్రి నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం ఎల్లారెడ్డిగూడెంలో ఈ సంఘటన జరిగింది. ఈ ఆసక్తికర సంఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావటంతో విషయం వెలుగుచూసింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఎల్లారెడ్డిగూడెం గ్రామానికి చెందిన పోగుల గణేష్ ఆంజనేయస్వామి ఆలయం తలుపులకు వేసిన తాళాన్ని పగులగొట్టే ప్రయత్నం చేశాడు. అదే సమయంలో హుండీలోని డబ్బులను చోరీ చేసేందుకు యత్నించాడు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటుచేసిన వినాయకుడి మండపంలో మెలకువతోనే ఉన్న యువకులు అలికిడి విని వెళ్లి గణేష్‌ను పట్టుకుని స్తంభానికి కట్టేశారు. అర్ధరాత్రి సమయంలో ఇక్కడ ఏంచేస్తున్నావు, తాళం ఎందుకు పగులగొడుతున్నావని కొందరు యువకులు అతడికి దేహశుద్ధి చేశారు. దీంతో అతడి పెదవులు చిట్లాయి. తాను ఇంతకుముందే నాలుగు పర్యాయాలు చోరీ చేశానని, తనపై కేసులు ఉన్నాయని వివరించాడు. రెండు గంటల పాటు స్తంభానికి కట్టి ఉంచారు. తన వివరాలు చెప్పి, తనకు ఆకలిగా ఉందని చెప్పడంతో వినాయకుడి మండపంలోని పులిహోరను గణేష్‌కు తినిపించారు. తెల్లవారుజామున ఆ యువకుడిని తండ్రికి అప్పజెప్పారు.

పట్టుబడిన గంజాయి విక్రేత


పోలీసులు అదుపులో నిందితుడు

భువనగిరి టౌన్, సెప్టెంబర్ 17: జిల్లాకేంద్రం భువనగిరి పట్టణంలో గంజాయి విక్రయిస్తున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు ఎక్సైజ్ డీటీఎఫ్ రాధాకృష్ణ ఆధ్వర్యంలో ఎక్సైజ్ పోలీసులు మంగళవారం దాడులు చేశారు. ఈమేరకు తాపీ పనులు చేస్తూ స్థానిక జంఖానాగూడలో అద్దె ఇంట్లో నివాసముంటున్న పశ్చిమబెంగాల్‌కు చెందిన జహీర్‌షేక్ వద్ద విక్రయానికి సిద్ధంగా ఉంచిన 100 గ్రాముల గంజాయి పట్టుబడింది. దీంతో నిందితుడిని అదుపులోకి తీసుకొని, గంజాయి స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్ సైదులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు తీవ్రగాయాలు

ఆలేరు రూరల్, సెప్టెంబరు 17: రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరులో ఈ ఘటన మంగళవారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. రాజాపేట మండలం పాముకుంట గ్రామానికి చెందిన బింగి శ్రీను ప్రస్తుతం హైదరాబాద్ ఉప్పల్‌లో నివాసముంటున్నారు. మంగళవారం పని నిమిత్తం హైదరాబాద్ నుంచి ఆటోలో ఆలేరుకు వస్తుండగా ఆలేరు పెద్ద మసీద్ వద్దకు రాగానే వరంగల్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఖాళీ ఇండేన్ గ్యాస్ సిలిండర్లతో వెళ్తున్న వాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో శ్రీను తలకు తీవ్రగాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. ఈవిషయమై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రజినికర్ తెలిపారు.


ధ్వంసమైన వాహనాలు, (ఇన్‌సెట్‌లో) గాయాలపాలైన ఆటో డ్రైవర్

పైన వాటర్ బాటిళ్లు.. లోపల లేగదూడలు

● వాటర్ బాటిల్ రవాణా పేరుతో లేగదూడల తరలింపు ● పట్టుకున్న వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ కార్యకర్తలు ● పోలీసులకు అప్పగింత.. కేసు నమోదు


లేగదూడలతో పట్టుబడిన వ్యాన్


లేగదూడలు

హుజూర్‌నగర్, సెప్టెంబరు 17: మినీ వాహనంలో వాటర్ బాటిళ్ల పేరుతో లేగదూడలను అక్రమంగా రవాణా చేస్తున్న వాహనాన్ని మంగళవారం పట్టుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలోని జంగాలకాలనీలో కొనుగోలు చేసిన దూడలను అక్రమంగా తరలిస్తుండగా వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ కార్యకర్తలు, బీజేపీ నాయకులు పట్టుకున్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంతంలో నెంబర్ ప్లేట్‌లేని మినీ వాహనంలో లేగదూడలు తరలిస్తున్నారు. అయితే వాహనంలో లోపల లేగదూడలు బయటకు కన్పించకుండా పైన వాటర్ బాటిళ్ల బస్తాలను వేశారు. వాహనం కోదాడ వైపు వెళుతుండగా.. కోదాడ రోడ్డు మూలమలుపు వద్ద ఉన్న భజరంగ్‌దళ్ కార్యకర్తలకు మూగజీవాల అరుపులు వినిపించడంతో వెంటనే వాహనాన్ని ఆపారు. వాహనాన్ని తనిఖీ చేయగా, అందులో 10 లేగదూడలు కన్పించాయి. భజరంగదళ్ కార్యకర్తలు వెంటనే బీజేపీ నాయకులకు సమాచారం అందించగా, వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ ముత్తయ్య ఆధ్వర్యంలో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వాహనాన్ని మునిసిపల్ కార్యాలయానికి తరలించారు. లేగ దూడలను మునిసిపల్ కార్యాలయంలో కట్టివేశారు. కాగా ఎస్ఐ ముత్తయ్య, పశువైద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డిని పిలిపించి, ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. అనంతరం లేగ దూడలను హైదరాబాద్ జియాగూడలోకి శ్రీసమృత కామధేను గోశాలకు తరలించారు. భజరంగదళ్, బీజేపీ, వీహెచ్‌పీ కార్యకర్తల నుంచి ఫిర్యాదు స్వీకరించి కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ ముత్తయ్య తెలిపారు.


దేవరకొండలో ఎమ్మెల్యే బాలునాయక్


మిర్యాలగూడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జెండా ఎగురవేస్తున్న డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, ఎమ్మెల్యే బీఎల్ఆర్


నకిరేకల్‌లో జెండా ఎగురవేస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

త్యాగాల యాదిలో..

జిల్లావ్యాప్తంగా మంగళవారం ప్రజాపాలన దినోత్సవం నిర్వహించారు. ఆయా కార్యాలయాల ఎదుట ప్రజాప్రతినిధులు, అధికారులు జాతీయ జెండాలు ఎగురవేశారు. వివిధ పార్టీల ఆధ్వర్యంలో విమోచన, విద్రోహ, విలీన దినోత్సవాలు నిర్వహించి జెండాలు ఎగురవేశారు. ఈ సందర్భంగా అమరవీరుల స్తూపాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.


నల్లగొండలో జెండా ఎగురవేస్తున్న టీడీపీ నాయకులు


నార్కట్‌పల్లిలో...


చండూరులో జాతీయ జెండా ఎగుర వేస్తున్న ఆర్డీవో సుబ్రహ్మణ్యం


బెటాలియన్‌లో జాతీయ నాయకుల చిత్రపటాలకు పూలమాల వేస్తున్న కమాండెంట్ సత్యశ్రీనివాస్


పెద్దవూరలో జెండా వందనం చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు


కొండమల్లేపల్లి: ఎంపీడీవో కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరణ


శాలిగౌరారంలో జెండా వందనం చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు


దేవరకొండ: సీపీఐ కార్యాలయం వద్ద జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు


నల్లగొండలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి సుధాకర్‌రెడ్డి


మునుగోడు: పలివెలలో గురునాథరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న పల్లా వెంకట్‌రెడ్డి

కేజీబీవీ పాఠశాల భవనాన్ని త్వరగా పూర్తిచేయాలి

తిరుమలగిరి(సాగర్), సెప్టెంబరు 17: మండల కేంద్రంలో నిర్మిస్తున్న కేజీబీవీ పాఠశాల భవనాన్ని త్వరితగతిన పూర్తి చేయా లని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలో అద్దె భవనంలో నిర్వహిస్తున్న కేజీబీవీ పాఠశాలను మంగళవారం పరిశీలించారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. మెనూ ప్రకారం ఆహారాన్ని అందిస్తున్నారా అని, ఉపాధ్యాయుల బోధన తీరు ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యాశాఖ అధికారులు, స్థానిక నాయకులతో కలిసి నిర్మాణంలో ఉన్న పాఠశాల భవనం వద్దకు వచ్చారు. ఈ క్రమంలో భవన నిర్మాణానికి సంబంధించి సంబంధిత ఇంజనీర్ల పర్యవేక్షణ సరిగా లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత డీఈతో ఫోన్‌లో మాట్లాడారు. భవన నిర్మాణం ఎందుకు ఆలస్యమవుతోందని ప్రశ్నించారు. వచ్చే నెల రోజుల్లో పాఠశాల భవనాన్ని సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంఈవో తరి రాము, ఎస్‌వో కవిత, నోడల్ అధికారి శ్రీనివాస్, రమావత్ కృష్ణానాయక్, కలసాని చంద్రశేఖర్, కృష్ణ, నాసర్‌రెడ్డి పాల్గొన్నారు.


విద్యార్థులతో కలిసిన భోజనం చేస్తున్న ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి

విశ్వకర్మ జయంతి అధికారికంగా నిర్వహించాలి

మిర్యాలగూడ టౌన్, సెప్టెంబరు 17: సృష్టికర్త విశ్వకర్మ జయంతిని అధికారికంగా నిర్వహించాలని సంఘ నాయకులు కోరారు. పట్టణంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో విశ్వకర్మ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. సంఘం నాయకుడు గడగోజు చంద్రశేఖర్ మాట్లాడుతూ చేతివృత్తులను గౌరవించాలన్నారు. యాంత్రీకరణలో ఆయా వృత్తులు అంతరించకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇనుగుర్తి గోవర్ధన్, సిరసనగండ్ల ఈశ్వరాచారి, అనుముల దుర్గాప్రసాద్, కాతోజు వాసు, వెంకటాచారి, సైదాచారి, నాగాచారి, శోభ, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లిలో విశ్వకర్మ జయంతి నిర్వహించారు. జెండా ఆవిష్కరించి బైక్ ర్యాలీ నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో యుగేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

దేవరకొండ: దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. దేవరకొండలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో విరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో టీవీఎస్ రెడ్డి, సుభాష్‌గౌడ్, రవీందర్‌రెడ్డి, కొల్లూరి శ్రీను, రవి, కృష్ణ పాల్గొన్నారు.


నల్లగొండలో పూజలు నిర్వహిస్తున్న విశ్వబ్రాహ్మణులు

రామగిరి: లోక కల్యాణం కోసం విశ్వకర్మ జయంతి నిర్వహిస్తున్నట్లు యజ్ఞ కమిటీ అధ్యక్షుడు గుంటోజు బ్రహ్మాచారి అన్నారు. విశ్వకర్మ ఆధ్వర్యంలో స్థానిక విశ్వబ్రాహ్మణ వసతి గృహంలో యజ్ఞ మహోత్సవం నిర్వహిచారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షులు కొల్లోజు సత్యనారాయణచారి, సామోజు లింగాచారి, కూరెళ్ళ రమణాచారి, గిరి, గొట్టిముక్కుల చంద్రశేఖర్ ఉన్నారు.

చింతపల్లి: వెంకటేశ్వరనగర్(మాల్)లో స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో విరాట్ విశ్వకర్మ జయంతి నిర్వహించారు.

దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న మోదీ

చండూరు, సెప్టెంబరు 17: ప్రధాని మోదీ దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని బీజేపీ నాయకులు అన్నారు. పార్టీ ఆధ్వర్యంలో చండూరులో మోదీ జన్మదిన వేడుకలు నిర్వహించారు. నిర్వహించారు. కేక్ కట్‌చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు కోమటి వీరేశం, దర్శనం వేణు, బొడిగె అశోక్, కాసాల జనార్ధన్, సత్యం, వేణు, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్: ప్రధాని మోదీ అభినవ ఛత్రపతి శివాజీ మహరాజ్ అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు సాదినేని శ్రీనివాసరావు అన్నారు. మోదీ జన్మదినం సందర్భంగా పార్టీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. అనంతరం ఏరియా ఆస్పత్రిలో పేషంట్లకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు తుమ్మలపల్లి హన్మంతరెడ్డి, ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్ సమరథ్, కొండేటి సరిత, రేపాల పురుషోత్తంరెడ్డి, ఎడ్ల రమేష్, కనపర్తి సత్యప్రసాద్, బంటు సైదులు పాల్గొన్నారు.


చండూరులో కేక్ కట్ చేస్తున్న బీజేపీ నాయకులు

చిట్యాలరూరల్: ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా మండలంలోని గుండ్రాంపల్లిలోని వినాయకుడి మండపంలో ప్రధాని పేరిట పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు గరిషె లింగస్వామి, రాచకొండ నరేష్, గరిషె నరేష్, మైల పరమేష్, గరిషె లింగస్వామి, రాచకొండ మల్లేష్, రాచకొండ నరేష్ పాల్గొన్నారు.

యాదవ మహా సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఏడుకొండలు



పెద్దఅడిశర్లపల్లి: అఖిల భారత యాదవ మహా సంఘం ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని కోదండాపురం గ్రామానికి చెందిన ముచ్చర్ల ఏడుకొండలు యాదవ్ ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లోని సంఘం భవనంలో రాష్ట్ర అధ్యక్షుడు బద్దుల బాబురావుయాదవ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయనను ఎన్నుకున్నారు. తన నియామకానికి సహకరించిన సంఘం నాయకులకు ఏడుకొండలు కృతజ్ఞతలు తెలిపారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

చండూరు రూరల్: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని కొండాపురం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు భూతం ముత్యాలు అన్నారు. మండల పరిధిలోని కొండాపురంలో నిర్వహించిన పోషన అభియాన్ కార్యక్రమంలో మాట్లాడారు. ఆకుకూరలు, పండ్లు, పాలు, గుడ్లు, మొలకెత్తిన గింజలు, తదితర పోషణ అందించే ఆహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పాండురంగం, అంగన్‌వాడీ టీచర్లు అవ్వారి నాగమణి, బరిగెల రమణ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

చందంపేట: ఇటీవల కురిసన భారీ వర్షాలకు మండలంలోని తెల్‌దేవరపల్లి గ్రామానికి చెందిన మన్యం నిరంజన్ మృతిచెందాడు. ప్రభుత్వం ప్రకటించిన రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కును నామిని బుచ్చమ్మకు తహసీల్దార్ అందజేశారు.

బాధితుడికి ఎమ్మెల్యే పరామర్శ

నల్లగొండ: రోడ్డు ప్రమాదంలో గాయపడి నల్లగొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కుమ్మరి కుంట కాల్వ గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త కన్నెబోయిన కొండల్‌ను నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట అనుముల కాంగ్రెస్ అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, గౌని రాజారమేష్ తదితరులు ఉన్నారు.

సీఎం సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలి

శాలిగౌరారం: నిరుపేదలను ఆదుకునేందుకు అందిస్తున్న సీఎం సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్ రెడ్డి అన్నారు. శాలిగౌరారంలో ఆరుగురు బాధితులకు మంజూరైన రూ2.18లక్షల విలువైన సీఎం సహాయ నిధి చెక్కులను మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ తిరుమలరాయిని గూడెం అధ్యక్షులు కర్రె సైదులు, మాజీ ఎంపీటీసీ వడ్లకొండ భిక్షం, వడ్లకొండ వెంకన్న, కొండ నరేష్, కూరం వెంకన్న, వడ్లకొండ నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల్లో సత్తా చాటాలి : వీరేశం

చిట్యాలరూరల్, సెప్టెంబరు 17: స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలు కైవసం చేసుకొని సత్తా చాటాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం కార్య కర్తలకు సూచించారు. మండలంలోని వెలిమినేడు గ్రామానికి చెందిన పలు పార్టీలకు చెందిన కుటుంబాలు నకిరేకల్‌లో ఎమ్మెల్యే సమక్షంలో మంగళవారం కాంగ్రెస్‌లో చేరారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు.

'విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి'

దేవరకొండ, సెప్టెంబరు 17: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ దేవరకొండ డివిజన్ కార్యదర్శి బుడిగె వెంకటేష్ డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో దేవరకొండలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. విద్యారంగం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం అవలంబిస్తోందన్నారు. గురుకుల పాఠశాలలో కనీస వసతులులేక విద్యార్థులు ఇబ్బందులుపడుతున్నారన్నారు. సొంత భవనాలు లేకపోవడంతో అద్దె భవనాలలో అవస్థలుపడుతున్నారన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు శివకుమార్, సాయి, వికాస్, బన్ని పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపిక


రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నాగార్జునసాగర్, సెప్టెంబరు 17: హిల్‌కాలనీలో బీసీ గురుకుల పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. సౌత్ జోన్ అథ్లెటిక్స్-2024లో భాగంగా అండర్-14 విభాగంలో ఎం. గణేష్, అండర్-18 విభాగంలో 100 మీటర్ల ఎం. చందు, అండర్-20 విభాగంలో 100 మీటర్ల పరుగు పందెంలో జే. తరుణ్, 1500 మీటర్ల పరుగు పందెంలో శివ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రాజశేఖర్ తెలిపారు. ఈ నెల 19,20వ తేదీల్లో హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో జరిగే పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు.

'వీవోఏ ఎన్నిక నిలిపివేయాలి'

నల్లగొండ క్రైం, సెప్టెంబరు 17: మునుగోడు మండలంలోని ఊకొండి గ్రామ వీవోఏ ఎన్నికను అధికారులు, మహిళా సంఘాల నాయకులను రాజకీయ పలు కుబడితో ప్రలోభపెట్టి అక్రమంగా ఎన్నిక కావాలనే ప్రయత్నాలను అధికారులు నిలిపి వేయాలని అదే గ్రామానికి చెందిన చందపాక వసంత కోరారు. నల్లగొండలో కలెక్టర్, డీఆర్‌డీఏ పీడీలకు మంగళవారం వినతిపత్రాలు అందజేశారు. వీవోఏగా పనిచేస్తున్న మేడిపల్లి యాదయ్యను పలు రకాల కారణాలతో 2022 అక్టోబరు నెలలో తొలగించారన్నారు. ఆయన భార్య ఎంపీటీసీగా ఎంపికై ఎంపీపీగా కూడా పని చేశారన్నారు. గ్రామంలో మహిళా సంఘాలను సమావేశ పరిచి ఏకగ్రీవంగా ఎంపిక చేసి విధులు నిర్వర్తించాలని ఏపీఎం, పీడీ ఆదేశించారన్నారు. అప్పటి నుంచి తానే గ్రామ వీవోఏగా విధులు నిర్వర్తిస్తూ అన్ని సంఘాలకు కావాల్సిన పనులను చేస్తున్నానని ఆమె పేర్కొన్నారు. వీవోఏ పోస్టు కావాలని మేడిపల్లి యాదయ్య హైకోర్టులో రిట్ పిటీషన్ వేశారని, దాని ఆధారంగా రాజకీయ నాయకుల అండదండలతో అధికారులను మభ్యపెట్టి వీవోఏగా కొనసాగేందుకు కుట్రలు చేస్తున్నారని ఆమె ఆరోపించారు.

తెలంగాణ సాయుధ పోరాటం గొప్పది

చిట్యాలరూరల్, సెప్టెంబరు 17: తెలంగాణ సాయుధ పోరాటం గొప్పదని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు తుమ్మల వీరారెడ్డి, బొంత చంద్రారెడ్డి అన్నారు. మండలంలోని పిట్టంపల్లిలో మంగళవారం జరిగిన పార్టీ గ్రామశాఖ మహాసభలో మాట్లాడారు. తెలంగాణ పోరాటంలో తొలి అమరుడు దొడ్డి కొమురయ్య బలిదానంతో పాటు నాలుగు వేల మంది చేసిన ప్రాణత్యాగ ఫలితమే నిజాం నవాబులు, దొరలు, భూస్వాముల పాలన అంతమైందన్నారు. సమావేశంలో జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య, అరూరి శ్రీను, మహేష్, ఉపేందర్ పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి: ఎర్రజెండా పేదలకు అండగా ఉంటుందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు తుమ్మల వీరారెడ్డి అన్నారు. మండలంలోని ఏపీ లింగోటం పార్టీ గ్రామశాఖ మహాసభలో మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి చెరుకు పెద్దులు, మల్లం మహేష్, చింతపల్లి బయ్యన్న పాల్గొన్నారు.

ఘనంగా అనంత పద్మనాభస్వామికి పూజలు

మిర్యాలగూడ రూరల్, సెప్టెంబరు 17: యాద్గార్‌పల్లిలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి, ఆగస్త్యేశ్వరస్వామి దేవాలయంలో అనంత పద్మనాభస్వామి జన్మదినం సందర్భంగా మంగళవారం స్వామివారికి వ్రతాలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి దంపతులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్మన్ పాదూరి సంజీవరెడ్డి, చింతరెడ్డి కరుణాకర్‌రెడ్డి, దుండిగాల యాదమ్మశ్రీనివాస్, జొన్నలగడ్డ రాజశేఖర్‌రెడ్డి, కట్టా పద్మాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పూజల్లో పాల్గొన్న మహిళలు